## క్లుప్తంగా

### శుభకార్యాల్లో మాజీ మంత్రి బుగ్గన



డోన్‌లో వివాహానికి హాజరైన బుగ్గన

డోన్/ప్యాపిలి/బేతంచెర్ల: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం డోన్ నియోజక వర్గంలో జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. డోన్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన పెద్దరాజు, దేవరబండ గ్రామంలో లక్ష్మయ్య, యు కొత్తపల్లె గ్రామంలో షేక్ వలి, డోన్‌లో రామచంద్రారెడ్డి కుమారుల వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పారిశ్రామికవేత్త బుగ్గారెడ్డి గృహప్రవేశానికి హాజరయ్యారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కటిక వేణుగోపాల్‌ను పరామర్శించారు. అలాగే ప్యాపిలి మండలంలో ఇటీవల వివాహం చేసుకున్న రఘునాథ్ రెడ్డి, భార్గవి, మనోజ్ కుమార్ రెడ్డి, సరిత దంపతులను ఆశీర్వదించారు. కొద్ది నెలల క్రితం మృతి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. బేతంచెర్ల శ్రీనగర్ కాలనీకి చెందిన వీరభద్రప్ప, కిరణ్ వాణి కుమార్తె మానస, మల్లికార్జున రిసెప్షన్‌కు హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

### ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన దాసరి చిన్న చెన్నయ్య, కేశాలమ్మ దంపతులు రూ.25,116 విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులకు నగదు అందజేశారు. దాతలను ఆలయ సంప్రదాయం ప్రకారం సన్మానించారు.

### ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



విశేష అలంకరణలో చౌడేశ్వరిదేవి

బనగానపల్లెరూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

### పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

డోన్ రూరల్: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. పట్టణంలోని 27,26 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోర వికాశం గురించి బాలికలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రతి రోజు గుడ్డు, పప్పు, పాలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఎండా కాలంలో నీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. సమావేశంలో సూపర్‌వైజర్ పరమేశ్వరి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, నాగజ్యోతి పాల్గొన్నారు.

### ప్రొఫెసర్ నాయక్‌పై విచారణ చేపట్టాలి

డోన్ టౌన్: రాయలసీమ విశ్వ విద్యాలయంలో రెక్టారుగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌పై సీబీ సీఐడీతో విచారణ చేయించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇమిడి లక్ష్మణసాయి డిమాండ్ చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా రోస్టర్ అమలు చేయడం, ఇష్టం వచ్చినట్లు ఉద్యోగాలు భర్తీ చేయడం, వర్సిటీకి చెందిన 150 ఎకరాల భూమిని ఇతరులకు కట్టబెట్టడం వంటివి చేశారని ఆరోపించారు.

### జాగ్రత్తలతో ఎండ నుంచి రక్ష

డోన్ టౌన్: జాగ్రత్తలతో పాటు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే ఎండ నుంచి ఉపశమనం పొందవచ్చని డోన్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు కళ్యాణ్‌బాబు, సుకుమార్, శశికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణి అన్నారు. శుక్రవారం ఎండ నుంచి ఎలా రక్షణ పొందాలి అనే అంశంపై రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పించారు.

# ఎన్నడు పూర్తయ్యేనో?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన వైనం
- మైనర్ పనులకూ పైసా విదిల్చని సర్కార్
- ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులకు తప్పని అవస్థలు





కొలిమిగుండ్ల, బెలుంలో నిలిచిన అదనపు తరగతి గదులు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాడు–నేడు పనులు చేపట్టింది. నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి కాగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరు చేయకపోవడంతో పలు చోట్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు.

**ప్రధాన పనులన్నీ పూర్తి**

మండలంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో రూ.76 లక్షలతో ఐదు అదనపు తరగతి గదులు, బెలుం ఉన్నత పాఠశాలలో రూ.31 లక్షలతో రెండు గదులు, కస్తూర్బా పాఠశాలలో రూ.85 లక్షలతో ఐదు గదుల నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. మూడు పాఠశాలల్లో ప్రధానమైన పనులు అన్నీ పూర్తయ్యాయి. మిగిలిన మైనర్ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు విదల్చకపోవడంతో ఆగిపోయాయి. వేసవి సెలవుల్లో అయినా పూర్తి పనులు పూర్తి చేసి వాడుకలోకి తీసుకొస్తారని భావించారు. కానీ ఆ పరిస్థితులు కనిపించడం లేదు. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుంది. పనులు చూస్తే ముందుకు కదలక పోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ విద్యాసంవత్సరంలో కూడా విద్యార్థులకు గదుల సమస్య వేధించనుంచి ఫ్లోరింగ్, కిటికీలు, డోర్స్,పెయింటింగ్, ఎలక్ట్రికల్స్ తదితర పనులకు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ స్తంభాల మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

### నేడు కొలిమిగుండ్లలో తిరంగా ర్యాలీ

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధనరెడ్డి పాల్గొంటారని చెప్పారు. బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛంధ్రా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుతో పాటు చలివేంద్రం ప్రారంభం ఉంటుందన్నారు. రోడ్లను శుభ్రపరచడం అనంతరం స్వచ్ఛంధ్రా ప్రతిజ్ఞ జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహిస్తారని.. అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.



మద్దిలేటిస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

### వేడుకగా తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి మహామంగళహారతులు సమర్పించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు.



కానాల గ్రామంలో పొగాకు దొరనాల కింద చేరిన వర్షపునీరు



మంగపల్లె శివారు పొలాల్లో నిలిచిన నీరు

### దంచికొట్టిన వర్షం

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు, మంగపల్లె, కానాల, పేరుసోముల, ఆర్.లింగందిన్నె గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన భారీ వర్షం కురవడంతో పొలాలు, ప్రధాన రహదారుల్లో భారీగా నీరు ప్రవహించాయి. పేరుసోముల, కానాల గ్రామాల్లో ఆరబెట్టుకున్న పొగాకు, మొక్కజొన్నలు తడిచిపోయాయి. కాగా కొద్ది రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు విశ్వరూపం చూపుతున్నాడు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది వేసవి కాలంలో కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని వాపోతున్నారు.



పట్టతో కప్పి ఉంచిన మొక్కజొన్నపైకి చేరిన నీరు



రథాన్ని లాగుతున్న భక్తులు

### ఘనంగా మైల తిరుణాల

- విజేతగా బాపట్ల వృషభాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మైల తిరునాలను ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు రథాన్ని లాగారు. మైల తిరుణాల సందర్భంగా ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు ఆలయంలో పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త, అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తేరు వద్ద అష్టోత్తర శతనామావళి, మంత్రపుష్పం, మంగళహారతి నిర్వహించి రథాన్ని లాగారు. గాంధీసెంటర్ నుంచి రథం పాండురంగ స్వామి ఆలయం వరకు చేరుకుంది. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు పాండురంగడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజు శనివారం వసంతోత్సవం, స్వామివారి చక్రస్నానం, నాకబలి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మైల తేరు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**హోరాహోరీగా బండలాగుడు పోటీలు**

పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో న్యూ కేటగిరి విభాగంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 11 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శివకృష్ణచౌదరి వృషభాలు నిర్ణీత 20 నిమిషాల వ్యవధిలో 4,250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో రూ. 1.10 లక్షలు కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్ కుమార్, గుంటూరు జిల్లా గరికపాడు వెంకట్ వృషభాలు 4 వేల అడుగుల దూరంతో రెండు జతల వృషభాలు ద్వితీయ స్థానంలో రూ.90 వేలు, రూ. 70వేలు దక్కించుకున్నాయి, నంద్యాల జిల్లా పెద్దకొట్టాల కేశవరెడ్డి వృషభాలు 3,895 అడుగుల దూరంతో నాల్గవ స్థానంలో రూ. 50 వేలు, డోన్‌కు చెందిన గురునాథ్ వృషభాలు 3,752 అడుగుల దూరంతో ఐదవ స్థానంలో రూ.40 వేలు, గుంటూరు జిల్లా గరికపాడు విష్ణువర్ధన్ వృషభాలు 3,614 అడుగుల దూరంతో ఆరో స్థానంలో రూ. 30 వేలు గెలుపొందాయి.



రాతిదూలం లాగుతున్న వృషభాలు

### బండలాగుడు విజేత డోన్ వృషభాలు

అవుకు: పట్టణంలో చెన్నకేశవస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా అవుకు జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. డోన్‌కు చెందిన సుబ్బారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. ద్వితీయ బహుమతి అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలు, తృతీయ బహుమతి నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన రాంభూపాల్ వృషభాలు, నాల్గో బహుమతి అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రమేష్ బాబు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గుర్విరెడ్డి వృషభాలు, ఐదో బహుమతి నంద్యాల జిల్లా హుసేనాపురానికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు, ఆరో బహుమతి చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్ రెడ్డి వృషభాలు గెలుపొందాయి. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



బండ లాగుడుతున్న వృషభాలు

### ఆటో బోల్తా.. బాలిక దుర్మరణం

పామిడి: అనంతపురం జిల్లా రామరాజుపల్లి సమీపంలో ఆటో బోల్తాపడి బాలిక మృతి చెందింది. పోలీసులు వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగేంద్ర తన సొంత ఆటోలో కుటుంబసభ్యులతో కలసి పెన్నహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు వెళ్లాడు. శుక్రవారం ఆలయం వద్ద పూజలు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పామిడి మండలం రామరాజుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించుకోలేక వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నాగేంద్ర కుమార్తె శైలజ (15) అక్కడికక్కడే మృతి చెందింది. నాగేంద్ర, సుదర్శన్, మోక్షిత, రాధమ్మకు గాయాలయ్యాయి. పామిడి సీఐ యుగంధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



బేతంచెర్ల: రంగాపురంలో అవగాహన ర్యాలీ,



ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బనగానపల్లె: టంగుటూరు పీహెచ్‌సీ సిబ్బంది



కొత్తబురుజు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

బేతంచెర్ల: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు విజయ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమలు కుట్టకుండా తెరలు వాడాలన్నారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే బేతంచెర్ల అర్బన్ హెల్త్ సెంటర్–3లో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యురాలు ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

**దోమలతో వ్యాధుల వ్యాప్తి**

ప్యాపిలి: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు వాణిశ్రీ, రాహుల్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం యాంటీ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తితోనే డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. దోమల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రిలో ర్యాపిడ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. టెస్టుల్లో వచ్చే ఫలితాలను బట్టి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్రగౌడు, గంగాదేవి, ప్రసన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**డెంగీపై అప్రమత్తత అవసరం**

బనగానపల్లె రూరల్: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి వాటిపై మూతలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రత్నాచారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**అవగాహన ర్యాలీ**

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తబురుజు గ్రామంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎడిస్, ఈజిప్టుఐ అనే జాతి దోమలు కుట్టడం వల్ల డెంగీ వస్తుందన్నారు. దోమలు పుట్టకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మురుగునీరు, చెత్త చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని పేర్కొన్నారు.

### రమణీయం.. రథోత్సవం

అవుకు: పట్టణంలో భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం శుక్రవారం రమణీయంగా సాగింది. తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం అవుకులోని మండపం వీధికి సాగింది. శుక్రవారం మైల తిరునాల సందర్భంగా తిరిగి మండపం వీధి నుంచి రాజా వీధి మీదుగా స్వామిఅమ్మవార్లు రథంలో తేరువీధికి చేరుకున్నారు. ప్రధాన వీధి మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. తేరును లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. వేలాది మంది భక్తుల నడుమ రథ చక్రాలు కదిలాయి. వీధి మొత్తం గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. దారిపొడవునా పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



అశేష భక్తజనం నడుమ స్వామివారి రథోత్సవం, (ఇన్‌సెట్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్యాలు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన గుంత



రెండు కొండల మధ్య ఇరుకుగా ఉన్న రోడ్డు

## ప్రయాణం.. ప్రమాదకరం

కొలిమిగుండ్ల: పెట్నికోట నుంచి గోర్విమానుపల్లె వరకు ఉన్న రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. చాలా చోట్ల రోడ్డు ఎత్తు పల్లాలు, గుంతలకు తోడు పలు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. రెండు వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. కొండమీదపల్లె సమీపంలో రెండు కొండల మధ్య ఉన్న రోడ్డు మరీ ప్రమాదకరంగా తయారైంది. అక్కడ మలుపుతో పాటు ఎత్తు పల్లంగా ఉండడం, కొండల మధ్యన రోడ్డు ఉన్న కారణంగా ఆ ప్రాంతంలోకి వచ్చే సరికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఎప్పుడు ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. నాయినపల్లె, పెట్నికోటతో పాటు అవుకు మండలంలోని కొండమీదపల్లె గ్రామాల ప్రజలు తాడిపత్రితో ఇతర ప్రాంతాలకు ఈమార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. నాపరాళ్ల ట్రాక్టర్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. ప్రమాదకరంగా గుంత ఉన్న చోట రైలింగ్ ఏర్పాటు, రెండు కొండల మధ్య ఉన్న రోడ్డు వద్ద ఓవైపు కొండను కొంతమేర తొలగించి విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు.

**19న గిద్దలూరు ఉప సర్పంచ్ ఎన్నిక**

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు పంచాయతీ ఉప సర్పంచ్ బత్తుల సులోచన ఈ నెల 16న వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశా రు. దీంతో ఈఓఆర్డీ, ఆర్ఓ రాధికారెడ్డి ఉప ఎన్నికకు నోటిఫికేన్ జారీ చేశారు. 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. గిద్దలూరు, మిక్కినేనిపల్లె, మంగపల్లె గ్రామాల్లో ఎన్నికైన వార్డు సభ్యులు, సర్పంచ్ హాజరుకావాలని పేర్కొన్నారు.